క్లుప్తంగా

నేడు ప్రభుత్వ పాఠశాలల బంద్



గద్వాల: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాల్లో ఆహారం కలుషితం కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని, దీనిపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీశ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శివ, ఉప్పేరు నర్సింహ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆహారం కలుషితం అవుతున్న ఘటనలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శనివారం ప్రభుత్వ పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

అందుబాటులో వరి విత్తనాలు



అయిజ: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ వారి ఆర్‌ఎన్‌ఆర్ (15048) రకం వరి విత్తనాలు మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి కోరారు. 15 కేజీల ప్యాకెట్‌ను రూ.700కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వరి విత్తనాలు కొనుగోలు చేసే రైతులు ఆధార్ కార్డు జిరాక్స్‌లను అందజేసి ఎకరాకు రెండు ప్యాకెట్ల చొప్పున తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రైతులకు వరి విత్తనాలు అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మల్లేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొలం పని చేస్తూ యువరైతు మృతి

ఎర్రవల్లి: గుండెపోటుకు గురై పంట పొలంలో యువ రైతు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన కోటేశ్వర్‌రెడ్డి (35) పొలం పనుల నిమిత్తం ఉదయం తన పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలి నేలపై పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించగా.. గుండెపోటుకు గురై అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారని తెలిపారు. మృతుడికి భార్య కవితతో పాటు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారని, ప్రభుత్వం నుండి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ధర్మవరం గ్రామానికి చెందిన కోటేశ్వర్‌రెడ్డి గుండెపోటుతో అకాల మరణం చెందాడు. విషయం తెలుసుకున్న అలంపూర్ శాసన సభ్యుడు విజయుడు శుక్రవారం ధర్మవరం చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట నాయకులు సుదర్శన్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, శేఖర్‌గౌడ్, జగన్‌మోహన్‌రెడ్డి, మదునాయుడు తదితరులు ఉన్నారు.

మద్యం తాగి వ్యక్తి..

అయిజ: మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం అదే కాలనీకి చెందిన సుందర్ రాజు (42) మద్యం తాగి బెల్టుషాపు ఎదుట మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులు బెల్టు షాపు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఎస్సీ కాలనీలో సుమారు 5 బెల్టు షాపులు ఉన్నాయని, వాటి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరారు. ఘటనపై ఎస్‌ఐ విజయభాస్కర్‌ను వివరణ కోరగా.. బాధిత కుటుంబ సభ్యులు ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకు పోయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి సోమవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

ఉచిత సేవలు లేనట్లేనా..?

- తరచూ రోగాల బారిన పడుతున్న గొర్రెలు, మేకలు
- మందులు లేవంటూ చేతులెత్తేస్తున్న ప్రభుత్వ వైద్యులు
- ప్రైవేటు మెడికల్ దుకాణాల్లో ప్రభుత్వ మందులు



పొలాల్లో గడ్డి మేస్తున్న గొర్రెలు

శాంతినగర్: వాతావరణం అనుకూలించక, సీజనల్ వ్యాధుల బారిన పడుతు జీవాలు రాలిపోతున్న రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఎప్పుడు ఎన్ని గొర్రెలు, మేకలు రాలిపోతాయో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని జీవాల పోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలంపూర్ నియోజక వర్గంలోని ఎనిమిది మండలాల్లో లక్షల్లో గొర్రెలు, మేకలు పోషిస్తున్నారు. గతంలో జీవాలకు కొన్ని సీజనల్ వ్యాధులు సోకితే పసుర్లు, నాటు వైద్యాలు చేయించి కాపాడుకునేవారు. ప్రస్తుతం వింత వ్యాధులు సోకడం, ఆర్థిక ఇబ్బందులు, వైద్యం సకాలంలో అందకపోవడంతో తరచూ జీవాలు మృత్యువాత పడుతున్నాయని యజమానులు వాపోతున్నారు. ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రుల్లో మందుల కొరత ఉందంటూ, వెంటనే మందులు వేయకపోతే జీవాలు చనిపోతాయని బెదిరిస్తూ, వారికి ఆమ్యామ్యాలు ముట్టజెప్పే ప్రైవేటు మెడికల్ దుకాణాలకు చీటీలు రాస్తూ ఆర్థికంగా నష్టాల పాలు చేస్తున్నారని యజమాను లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి జీవాలకు పూర్తి స్థాయిలో ఉచితంగా మందు లు పంపిణీ చేసి గొర్రెలు, మేకల అభివృద్ధికి చేయూత అందించాలని జీవాల పోషకులు కోరుతున్నారు.

ప్రైవేటు వారితోనే వైద్యం..

ప్రభుత్వం నియమించిన వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించడం, రోజుల తరబడి తిప్పడంతో జీవాల యజమానులు ప్రైవేటు వారిని ఆశ్రయిస్తున్నారు. మందుల కోసం ఎప్పుడు వెళ్లినా స్టాకు లేదంటూ సిబ్బంది చేతులు ఎత్తేయడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక ప్రైవేటుగా ప్రాక్టీస్ చేస్తున్న వారిని ఆశ్రయించి మెడికల్ దుకాణాల్లో మందులు తెచ్చుకుని వైద్యం చేయిస్తున్నట్లు పశుపోషకులు చెబుతున్నారు.

ఆరు నెలలకోసారి టీకాలు..

జీవాలకు ప్రతి ఆరు నెలలకోసారి వివిధ వ్యాధులకు సంబంధించి టీకాలు వేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా గొర్రెలు, మేకలకు పారుడు రోగం, అమ్మతల్లి, నీలి నాలుక, చిటికె రోగం, గాలికుంటు వ్యాధి, గొంతు వాపు, జబ్బవాపు రోగాలు ఎక్కువగా సోకుతుంటాయి. ప్రభుత్వం ప్రతి ఏడాది ఆయా వ్యాధులకు సంబంధించి టీకాలు ఉచితంగా పంపిణీ చేస్తారు. ఈ ఏడాది నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని పలు గ్రామాల్లో టీకాలు వేసిన దాఖలాలు లేవని జీవాల యజమానులు చెబుతున్నారు.

సొంత డబ్బులతో వైద్యం..



జీవాలకు ఏ వ్యాధి వచ్చినా సొంత డబ్బులతో మందులు కొనుగోలు చేసి వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు ఇస్తున్నామని చెబుతారే గాని కొందరికి ఇచ్చి అయిపోయినావని చెబుతున్నారు.. ఫలాన మెడికల్ షాపులో దొరకుతాయి తెచ్చుకోండని చీటీలు రాస్తున్నారు. – పరుశరాముడు, గొర్ల యజమాని, పర్దిపురం

గ్రామానికి వచ్చిన దాఖలాలు లేవు..

పశు వైద్యులు కానీ.. సిబ్బందిగాని మా గ్రామానికి వచ్చిన దాఖలేలు లేవు. ప్రైవేటు మందుల దుకాణాల్లో తెచ్చుకుని ప్రైవేటు వైద్య సిబ్బందితో వైద్యం చేయించాం. నెల నెలా వేలల్లో మందులకు, వైద్యులకు డబ్బులు ఖర్చు పెడుతున్నాం. ప్రభుత్వం నుంచి ఉచితంగా మందులు ఇస్తే ఆర్థికంగా నిలదొక్కుకుంటాం. – పెద్ద బీసన్న, గొర్రెల యజమాని, యాపదిన్నె

గొర్లు అమ్ముకున్నాను..



మా తాతల నుంచి గొర్లు మేపుకుని జీవనం సాగిస్తున్నాం. జీవాలకు వ్యాధులు ఎక్కువ కావడం, సరియైన సమయంలో వైద్య సేవలు అందకపోవడంతో తరచూ జీవాలు చనిపోతున్నాయి. దీంతో అన్ని గొర్రెలు అమ్మేసి పొలం పనులు చేసుకుంటున్నాం. ఒక్కోసారి వందల గొర్రెలు వ్యాధుల సోకి చనిపోయాయి. – కుర్వ తిమ్మప్ప, యాపదిన్నె

డిసెంబర్ 2 నుంచి కుష్టు వ్యాధి సర్వే



సర్వే వివరాల కిట్ అందిస్తున్న అధికారులు

మానవపాడు: కుష్టు వ్యాధి సర్వే డిసెంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు ఉంటుందని డాక్టర్ సింధు తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఆరోగ్యకేంద్రంలో సిబ్బందికి కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుష్టువ్యాధి ప్రారంభంలోనే గుర్తించాలని సూచించారు. చర్మానికి, నరాలకు వ్యాధి సోకుతుందని, తగ్గిన జాగ్రత్తలు తీసుకుంటే త్వరగానే నయం చేయొచ్చన్నారు. ఆరోగ్యకేంద్రం పరిధిలోని ప్రతి గ్రామంలో కుష్టువ్యాధి సర్వే నిర్వహించాలని, వివరాలు పక్కాగా నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ యాకుబ్‌బాషా, చంద్రన్న, తిరుమల్‌రావు, ఆరోగ్యకేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘పోలీస్‌స్టేషన్‌ను తరలించొద్దు’



సంపత్ కుమార్‌ను కలిసిన ఉండవెల్లి నాయకులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తరలించాలని ఎస్‌ఐ మహేష్ రైతు సంఘం సభ్యులకు, గ్రామ పెద్దలు, నాయకులకు తెలపడంతో శుక్రవారం శాంతినగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను కలిసి పోలీస్‌స్టేషన్‌ను మార్చకుండా యథాస్థానంలో ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌ను యథాస్థానంలో ఏర్పాటు చేయాలని ఎస్పీకి ఫోన్‌లో కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, నాయకులు మద్దిలేటి, నయీం, రాంబాబు, బుచ్చిరెడ్డి, షాకీర్, చాంద్ బాషా, రసూల్, రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాబృందం

ఎర్రవల్లి: మండల కేంద్రంతో పాటు కొండేరు, వల్లూరు గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ నరేష్ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సాంస్కృతిక సారథి అధ్యక్షుడు రాహుల్ కళా బృందం సభ్యులతో కలిసి ఆయా గ్రామాలను సందర్శించి ప్రభుత్వం గత ఏడాది నుంచి అందిస్తున్న వివిధ పథకాల గురించి ఆట, పాటల రూపంలో అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరా మహిళా శక్తి, యాభై వేల ప్రభుత్వ ఉద్యోగాలు, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, తదితర పథకాలపై కళాబృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు ప్రసాద్, భూపతి, రమాదేవి, హజ్రత్, కృష్ణ, స్వామి, కవిత, కేశవులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



కూరగాయలు పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

గద్వాల (ధరూరు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచితో పాటు శుభ్రంగా ఉండాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని రేవులపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల కోసం సరఫరా చేసిన బియ్యంలో పురుగులు, దుమ్ము లేకుండా శుభ్రంగా కడగాలని సూచించారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులోని అలంపూర్ చౌరస్తా సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పెట్రోలింగ్ పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారని ఎస్‌ఐ మహేష్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం సమయంలో పంచలింగాలకు చెందిన ట్రాక్టర్ ఎలాంటి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తుండగా.. జియో రిలయన్స్ పెట్రోల్ పంపు వద్ద పెట్రోలింగ్ పోలీసులు మంజునాథ్, మద్దిలేటి పట్టుకొని డ్రైవర్ బాబు, యజమాని రాకేష్‌పై కేసు నమోదు చేశారు

కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన



నిరసనలో పాల్గొన్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

అయిజ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం విద్యా శాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా మండల జేఏసీ అధ్యక్షురాలు అనురాధ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యూలర్ చేస్తామని చెప్పినా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అది వీలు కాదని, పే స్కేల్ అమలు చేస్తామని చెప్పారన్నారు. ఇప్పటి వరకు హామీ నెరవేర్చలేదని వాపోయారు. ఇచ్చిన హామీ నెరవేర్చకుంటే సమ్మె చేస్తామని హెచ్చరించారు. సందర్భంగా ఎంఈఓ రాములుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రఘు శర్మ, కేజీబీవీ ఎస్‌ఓ చెన్న బసమ్మ, సీఆర్‌టీ ప్రణీత, శ్రీనివాసులు, ఉదయ్ కిరణ్, తిరుమలేష్ స్వాతి, వీరుపాక్షమ్మ, శాతమ్మ, శ్రీదేవి, హసియా, శ్రావణ్ బాబు పాల్గొన్నారు.

రేపు అంతర్రాష్ట్ర భజన పోటీలు

ఇటిక్యాల: మండలంలోని బుడ్డారెడ్డిపల్లి గ్రామంలో కార్తీకమాసం ముగింపును పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణం సందర్భంగా ఆదివారం అంతరరాష్ట్ర భజన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 96667 41163, 72870 55024 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి

మానవపాడు: విద్యార్థులు సృజనాత్మకతతో ఆలోచించినప్పుడే అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయని ఎస్‌ఓ అనురాధ తెలిపారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బాలభవన్‌లో టీఎస్‌జీసీ స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజశేఖర్, జిల్లా ఎస్‌జీసీ కోఆర్డినేటర్ శ్రీధర్ ఆధ్వర్యంలో వేస్ట్, వెల్త్ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. మానవపాడు పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు.

బొలెరో వాహనం పట్టివేత

మానవపాడు: అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ చంద్రకాంత్ హెచ్చరించారు. తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహనాన్ని చంద్రశేఖర్‌నగర్ సమీపంలో శుక్రవారం పట్టుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా వాహనం పోలీస్‌స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ రమేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా అధికారులు

గద్వాల (కేటీ దొడ్డి): విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని కుచినెర్ల, నందిన్నె పాఠశాలలను జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ప్రియాంక, బాలరాజు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి మధ్యాహ్న భోజనం పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ప్రతిరోజు విద్యార్థులకు మెనూ ప్రకారం, పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని, వంట పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నందిన్నె పాఠశాలలో తాగునీటికి సంబంధించిన సంపును శుభ్రం చేయించారు.

ఆస్పత్రుల్లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి

గద్వాల (గద్వాల అర్బన్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు ఆస్పపత్రుల, ల్యాబ్‌ల దోపిడీని నియంత్రించాలని కోరారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వైద్య సిబ్బందిని నియమించాలని, మందుల కొరతను తీర్చాలని, పెండింగ్‌లోని ప్రభుత్వ ఆస్పపత్రుల భవన నిర్మాణాలను పూర్తి చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఉప్పేరు నర్సింహ, రామకృష్ణ, నరేష్, అశోక్, మహేష్ తదితరులు ఉన్నారు.

‘విద్యార్థులపై నిర్లక్ష్యం వీడాలి’



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులపై వహిస్తున్న నిర్లక్ష్యాన్ని వీడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉన్నా కూడా సరైన వసతులు లేవని మండిపడ్డారు. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం లేదని, నీటి వసతి లేకపోవడంతో మరుగుదొడ్లను వాడుకోలేని దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. వంట చేసేందుకు సరైన గది లేకపోవడంతో ఆరుబయట వంట చేస్తున్నారని, వంట ఏజెన్సీ వారికి ఇచ్చే బిల్లులు వంట సరుకులకు సరిపోకపోవడంతో నాసిరకం సరుకులు కొనుగోలు చేసి భోజనం తయారు చేయాల్సి వస్తుందని వాపోయారు. విద్యార్థులకు సరైన వసతులు కల్పించకుంటే బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపడుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, భీమసేనరావు, భగత్‌రెడ్డి, ప్రదీప్‌స్వామి, వెంకటేష్, లక్ష్మణాచారి, వీరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్ బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఆలయ అధికారులు, నాయకులు

గద్వాల (మల్దకల్): ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గద్దం కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. డిసెంబరు 13న స్వామి వారి కల్యాణోత్సవం, 14న తెప్పోత్సవం, 15న స్వామివారి మహా రథోత్సవం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు వెల్లడించారు. అంతకు ముందు మండల నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విక్రంసింహారెడ్డి, సీతారామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నరేందర్, అరవిందరావు, చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణ, సవారి, వెంకటన్న, మధు, పరశురాముడు, శ్రీనివాసులు, నాగరాజు, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు సదస్సుకు తరలిన అన్నదాతలు



మానవపాడు నుంచి..



అయిజ నుంచి మహబూబ్‌నగర్‌కు బయలుదేరుతున్న నాయకులు, రైతులు

గద్వాల (మల్దకల్): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే రైతు సదస్సుకు మల్దకల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వ్యవసాయాధికారులతో కలిసి తరలివెళ్లారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే రైతు పండగలో ఈ రైతులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజశేఖర్, ఏఈఓలు ఖాజాపాష, హరిక, జోహన, కిషోర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అయిజ: రైతు పండుగలో భాగంగా శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో రైతులు తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి, రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి, ఆర్.శ్రీధర్, దేవేందర్, ఫిరోజ్, మైనర్ బాబు, షాలిఫైల్వాన్, కృష్ణ, బాషా పాల్గొన్నారు.


మానవపాడు: మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతు పండుగకు మండల రైతులు బయలుదేరారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున వెళ్లారు. కార్యక్రమంలో ఏఓ సందీప్, వ్యవసాయ విస్తరణ అధికారులు మణిప్రకాశ్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి మనోహర్‌బాబు, రైతులు, తదితరులు ఉన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ కల సాకారం

గద్వాల (గట్టు): బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గద్వాలలో ఏర్పాటు చేసిన దీక్షా దివస్‌కు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు శుక్రవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ కృషి ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కల సాకారమైందన్నారు. బోయలగూడెం, బల్గెర, గట్టు, యల్లందొడ్డి గ్రామాలకు చెందిన నాగరాజు, రామునాయుడు, రాజునాయుడు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గద్వాలకు వెళ్లారు.



సింహగర్జనకు తరలిరావాలి



ఆహ్వానాలు అందిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

అలంపూర్: మాలల సింహగర్జనకు వేలాదిగా తరలిరావాలని అంబేడ్కర్ సంఘం నాయకులు మద్దిలేటి, బలగం నాగరాజు పిలుపునిచ్చారు. మాలల సింగర్జనకు హాజరు కావాలని అలంపూర్ పట్టణంలో శుక్రవారం ఇంటింటికి వెళ్లి ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో డిసెంబర్ 1న మాలల సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మాలల సంఖ్య తక్కువగా ఉందని కొందరు ప్రచారం, సింహగర్జనకు లక్షలాదిగా తరలి వచ్చి సత్తా చాటాలనాని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు మనోహర్, బాలరాజు తదితరులు ఉన్నారు.